క్లుప్తంగా

నేడు మంత్రి జన్మదిన వేడుకలు

చిత్తూరు కార్పొరేషన్: అటవీ, విద్యుత్ శాఖల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం నగరంలో నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు కార్పొరేటర్ హరిణిరెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రిలో బేబీకిట్స్ పంపిణీ, 11.30 గంటలకు గాంధీసర్కిల్‌లో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, 12 గంటలకు ఎంఎస్ఆర్ సర్కిల్‌లో మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్‌సురేష్, అనంతరం పాతకోర్టు వద్ద వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షులు జ్ఞానజగదీష్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్, అన్నదానం చేస్తారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరుకానున్నారు. సంతపేట కూడలి వద్ద మధ్యాహ్నం 12 గంటలకు వైఎస్సార్‌సీపీ నాయకులు భూపేష్ ఆధ్వర్యంలో అన్నదానం చేయనున్నారు.

ధన్యవాదాలు కలెక్టర్ సార్!



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీఆర్‌ఓల అసోసియేషన్ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నో ఏళ్లుగా నిరీక్షిస్తున్న తమకు ఉద్యోగోన్నతులు కల్పించారంటూ వీఆర్‌ఓలు కలెక్టర్ షణ్మోహన్‌కు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా వీఆర్‌ఓల అసోసియేషన్ అధ్యక్షుడు బాలాజీరెడ్డి, ప్రధాన కార్యదర్శి పద్మనాభం, సభ్యులు మంగళవారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వారు మాట్లాడుతూ, వీఆర్‌ఓ కేడర్ నుంచి సీనియర్ అసిస్టెంట్ కేడర్ ఉద్యోగోన్నతులకు ఎన్నో ఏళ్లు నిరీక్షించామన్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారుల చొరవతో తమకు ఇప్పుడుత న్యాయం చేశారన్నారు. అనంతరం కలెక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఉద్యోగోన్నతులు పొందిన వీఆర్‌వోలు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

నేడు మద్దిపట్లపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష

ఐరాల: మండలంలోని మద్దిపట్లపల్లె గ్రామ సచివాలయ పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో రోగులకు వైద్య నిపుణులు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తారని చెప్పారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా గ్రామాలకే స్పెషలిస్ట్ వైద్యులు వస్తున్నారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారు ?



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: మంజూరైన ఇళ్ల నిర్మాణ విషయంలో లబ్ధిదారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎంపీడీఓ గౌరి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని తేనేపల్లి సచివాలయంలో లబ్ధిదారులతో సమావేశమయ్యారు. ప్రభుత్వ భూమి, ఇళ్ల నిర్మించుకోవడం కోసం నగదును అందిస్తున్నప్పుడు ఎందుకు వెనకడుగు వేస్తున్నారని ప్రశ్నించారు. తేనేపల్లి లేఅవుట్‌లో 60 ఇళ్ల మంజూరైతే వాటిలో 25 ఇళ్ల నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు. మిగిలినవి ఎందుకు పూర్తి కాలేదని లబ్ధిదారులను ప్రశ్నించారు. వలంటీర్లు వీటిపై దృష్టి పెట్టి లబ్ధిదారులతో మాట్లాడాలని సూచించారు. వీలైనంత త్వరగా పనులు పూర్తయితే గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉండాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు లక్ష్మి, షర్మిల, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కిషోర్, వైస్ సర్పంచ్ నందయ్య తదితరులు పాల్గొన్నారు.





చిత్తూరు అర్బన్ : రోగులకు జగనన్న సురక్ష కిట్లను అందచేస్తున్న కమిషనర్ అరుణ, గుడిపాల: పాపసముద్రంలో..., తవణంపల్లె : టి.పుత్తూరులో..

జగనన్న సురక్షతో అందరికీ వైద్యం

చిత్తూరు అర్బన్: జగనన్న ఆరోగ్య సురక్షతో సామాన్యులకు సైతం కార్పొరేట్ తరహా వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నామని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ అరుణ అన్నారు. చిత్తూరులోని మురకంబట్టు సమీపంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని కార్పొరేటర్లతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ, ఎలాంటి ఆర్థిక భారం లేకుండా పేదలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను కూడా ఉచితంగా పంపిణీ చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రధానంగా మహిళలు, చిన్న పిల్లలు, వృద్ధులకు ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. అనంతరం మహిళా సంఘాలు, స్త్రీ శిశు సంక్షేమశాఖ సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, కార్పొరేటర్లు శ్రీకాంత్, స్వరూప రాణి, దళవాయి సునిత, నవీన్, ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ లోకేష్, మెప్మా సీఎంఎం గోపి, ఏసీపీ రామకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

పాపసముద్రంలో 252మందికి వైద్య పరీక్షలు

గుడిపాల: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలందరికీ ఉచితంగా వైద్య సేవలు అందుతున్నాయని ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం పాపసముద్రం సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. 252 మందికి వైద్యులు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు సుధ, లోకేష్, అనూష, శేషగిరి, హరి పాల్గొన్నారు.

తవణంపల్లె: ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆశయమని ఇన్‌చార్జ్ ఎంపీపీ పట్నం ప్రతాప్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని టి.పుత్తూరు సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో ఏడు రకాల జబ్బులకు సంబంధించి వైద్యులు 472 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన వంటలు, తాజా కూరగాయల స్టాల్‌ను ప్రదర్శించి గర్భిణులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, సర్పంచ్‌లు రవిచంద్రారెడ్డి, చలపతి, మండల అధ్యక్షుడు హరిరెడ్డి, నాయకులు, వైద్య, ఆరోగ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పొలకలలో 320మందికి..

ఐరాల: మండలంలోని పొలకల–2 గ్రామ సచివాలయంలో మంగళవారం పొలకల సర్పంచ్ వసంత ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 320 మంది రోగులకు స్పెషలిస్ట్ డాక్టర్లు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి స్టాల్స్‌ను ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్లు, అధికారుల, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గాండ్లపల్లెలో 223మందికి..

పూతలపట్టు: మండలంలోని గాండ్లపల్లె పంచాయతీ పరిధిలో ఎంపీటీసీ రాజెమ్మ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 223 మంది రోగులకు వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, ఎంపీడీఓ గౌరి వైద్యాధికారులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అండగా ఉంటాం

చిత్తూరు అర్బన్: నగరంలోని నిరాశ్రయులకు అండగా ఉండటంతో పాటు వారికి కావాల్సిన కనీస సదుపాయాలను కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకోనున్నట్లు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ అన్నారు. అంతర్జాతీయ నిరాశ్రయుల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం చిత్తూరులోని మెప్మా, సపోర్ట్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పట్టణ నిరాశ్రయుల కేంద్రంలో అభాగ్యులకు వస్త్రాలు, పెట్టెలు ఆమె పంపిణీ చేసి మాట్లాడారు. నిరాశ్రయులు సంతోష జీవితం గడపాలని ఆకాంక్షించారు. నిరాశ్రయుల అర్హత మేరకు రేషన్‌కార్డులు, పింఛన్లు, ఆధార్ కార్డులను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సపోర్ట్ సంస్థ ప్రతినిధి జోసెఫ్ రాజు, మెప్మా అధికారి గోపి పాల్గొన్నారు.

చీకూరుపల్లెలో 300మందికి..

బంగారుపాళెం: మండలంలోని చీకూరుపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని గుండ్లకట్టమంచి జెడ్పీ హైస్కూల్ ఆవరణలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్ చెంగల్‌రాయన్ మాట్లాడుతూ పేదలకు సురక్ష శిబిరంలో 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ చంద్రారెడ్డి, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొలకమడుగులో..

యాదమరి: మండలంలోని మొలకమడుగు గ్రామంలో వైద్యులు మంగళవారం ఇంటింటికి వెళ్లి సర్వే చేయడంతో పాటు వృద్ధులకు బీపీ, షుగర్ టెస్ట్ చేశారు. అనంతరం వారితో మాట్లాడారు. జగనన్న సురక్ష పథకంలో మీ గ్రామంలోనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యులు చికిత్స చేసి ఉచితంగా మందులు అందజేశారు.




బంగారుపాళెం: గుండ్లకట్టమంచి గ్రామ జెడ్పీ హైస్కూల్‌లో..., యాదమరి : మొలకమడుగులో ఇంటింటా సర్వే చేస్తున్న వైద్యులు




ఐరాల: వృద్ధుడికి కళ్ల జోడు ఇస్తున్న నాయకులు, పూతలపట్టు: శిబిరంలో మందుల గురించి అడిగి తెలుసుకుంటున్న అధికారులు, నాయకులు

బీఎంసీయూ నిర్మాణాల్లో నాణ్యత తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

- జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో నిర్మిస్తున్న బీఎంసీయూ (బల్క్ మిల్క్ చిల్లింగ్ యూనిట్లు) నిర్మాణాల్లో నాణ్యతాప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అమూల్ ప్రతినిధి, ఇతర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ, బీఎంసీయూ నిర్మాణాలను వేగవంతం చేయాలని, పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పనులు పూర్తయి ప్రారంభించనున్న కేంద్రాలలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలని పశుసంవర్ధకశాఖ అధికారులను ఆదేశించారు. బీఎంసీయూల పరిధిలోని రైతుల బ్యాంకు ఖాతాలను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డెయిరీ డెవలప్‌మెంట్ అధికారి రవిచంద్రన్, డీసీఓ బ్రహ్మానందరెడ్డి, డీసీసీబీ ఏజీఎం సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

గుడిపాల: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఎంపీటీసీ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని పశుమంద అంగన్‌వాడీ సెంటర్‌లో మంగళవారం గర్భవతులు, బాలింతలకు వైఎస్సార్ పోషణ కిట్లను విజయలక్ష్మితో పాటు సర్పంచ్ రజనీకాంత్ పంపిణీ చేసి మాట్లాడారు. నాణ్యమైన పౌష్టికాహారం ప్రతి తల్లీబిడ్డకు అందాలని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉండాలన్నారు. జంక్ ఫుడ్‌కు అందరూ దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కల్పన పాల్గొన్నారు.



పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ, సర్పంచ్

రోడ్డుపై దొరికిన ఐ-ఫోన్ పోలీసులకు అప్పగింత



పోలీసుల సమక్షంలో ఫోన్‌ను బాధితుడికి అప్పగిస్తున్న సురేష్

చిత్తూరు అర్బన్: రూ.50 నోటు రోడ్డుపై దొరికితే అటూ ఇటూ చూసి జేబులో పెట్టుకుని వెళ్లిపోయే రోజులివి. అలాంటిది రూ.75 వేల విలువ చేసే ఐ-ఫోన్ దొరికితే..? అయినా సరే ఫోన్ తీసుకొచ్చి పోలీసులకు అప్పగించారు. వివరాలు..చిత్తూరులోని తోటపాళ్యంకు చెందిన సురేష్ గాంధీరోడ్డులోని ఓ బ్యాంకులో పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి ఇంటికి వెళుతుండగా రోడ్డుపై ఓ ఫోన్ కనిపించింది. దానిని తీసుకుని అక్కడే ఎదురు చూశాడు. ఎవరూ రాకపోవడంతో మంగళవారం ఉదయం మంగళవారం ఉదయం వన్‌టౌన్ సీఐ విశ్వనాథరెడ్డికి ఆ ఫోన్ అప్పగించారు. అప్పటికే కొంగారెడ్డిపల్లెకు చెందిన భూపతి అనే వ్యక్తి పోలీస్ స్టేషన్‌కు వచ్చాడు. రూ.75 వేల విలువ చేసే ఐ-ఫోన్‌ను తన సోదరి బహుమతిగా ఇచ్చిందని, గణేష్ నిమజ్జన ఉత్సవంలో దీన్ని పోగొట్టుకున్నట్టు బాధితుడు పేర్కొన్నాడు. ఫోన్‌ను సురేష్ చేతుల మీదుగా భూపతికి అందచేశారు. నిజాయితీగా ఫోన్ తీసుకొచ్చి స్టేషన్‌లో అప్పగించడంతో సీఐ, సురేష్‌ను అభినందించారు.

కాణిపాకంలో బజరంగ్ దళ్ సభ్యుల పూజలు



విశ్వహిందూ పరిషత్ ప్రచార రథానికి ప్రత్యేక పూజలు చేసి కరపత్రాలు విడుదల చేస్తున్న ఆలయ ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద విశ్వహిందూ బజరంగ్ దళ్ శౌర్య జాగరణ యాత్ర సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఉదయం వారు ప్రత్యేక ప్రచార రథంలో కాణిపాకం చేరుకున్నారు. అనంతరం ప్రచార రథానికి పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈఓ వెంకటేశు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, చిత్తూరు విశ్వహిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరం



సాధన చేస్తున్న సీనియర్ సాఫ్ట్‌బాల్ క్రీడాకారులు

ఐరాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం జిల్లాస్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరంలో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని సాధన చేశారు. ఇటీవల ఎంపికైన సుమారు 20 మంది క్రీడాకారులు త్వరలో కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో నిర్వహించే రాష్ట్రస్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం కోమల, పీడీ దేవ తెలిపారు. వారు మాట్లాడుతూ క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో మంచి ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.